# వెండితెరపై యమధర్మరాజు!

'యముండ!'



ఈ మాట చదవగానే  మీ మదిలో ఒక ఆకృతి మెదలిఉంటుంది.
తీరైన విగ్రహంతో, వినసొంపైన గర్జనతో పురాణాలలో మనం విన్న, చదివిన యమధర్మరాజుకు వెండితెర మీద ప్రాణప్రతిష్ట చేసిన  వ్యక్తి- మీకు తెలుసు!
కైకాల సత్యనారాయణ.
'ఎన్.టి.రామారావుకు డూపు' అని సినిమా రంగంలోకి ప్రవేశించిన తొలినాళ్ళలో ఆయన సత్తా తెలియని వాళ్ళు అన్నారు.
ఎస్.వి. రంగారావుకు అసలైన వారసుడని అలా వాళ్లే తిరిగి అన్నారు.
అటువంటి నటుడు మరొకరు ఉండరని ఈనాడు అందరూ అంటారు.
ఆ అద్వితీయ నటుడి జన్మదినోత్సవం జులై 25.

కృష్ణాజిల్లాలో జన్మించిన సత్యనారాయణ, అప్పటికే అదే జిల్లా నుంచి సినిమా రంగంలోకి ప్రవేశించిన నటులు, రచయితలను ఆదర్శంగా తీసుకున్నారు. తన లక్ష్యము సినీ రంగమూ అనే నిర్దేశించుకున్నారు.
అలా తనకు తనే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించుకునేందుకు మద్రాస్ చేరారు.

సినిమా పరిశ్రమలో ఎందరికో అవకాశాలిప్పించిన ఎన్.టి. రామారావుకు డూప్‌గా  కొన్ని సినిమాలలో నటించి, తర్వాత ప్రతినాయకుడిగా ఎన్నో సినిమాలలో నటించారు. క్రమంగా ఆయన హాస్య పాత్రలలోనూ, క్యారెక్టర్ యాక్టర్‌గానూ కూడా నటించారు.

కొన్ని సినిమాలలో విలన్‌కు అమాయక కొడుకుగా నవ్వించారు. మరికొన్ని సినిమాలలో భయానకరసాన్ని గుప్పించారు. ఒకటేమిటి? అన్ని రసాలను కలబోసిన పాత్రలలో తెలుగు సినీ ప్రేక్షకులను అలరించారు. ఎన్ని పాత్రలలో నటించినా  యమధర్మరాజుగా ప్రేక్షకుల మదిలో నిలచిపోయారు. వృత్తిపట్ల నిబద్ధతతో కూడిన కాఠిన్యం, వ్యవహార జ్ఞానం తక్కువగా ఉండడం వల్ల వచ్చిన అమాయకత్వం యమధర్మరాజు పాత్రకు తప్పనిసరి లక్షణాలుగా చూపుతూ ఆ పాత్రలో ఆయన నటించిన తీరు అసామాన్యం.

దేవుడు చేసిన మనుషులులో సత్యనారాయణ పోషించిన తాగుబోతు పాత్ర ఎస్.వి. రంగారావు మెప్పు పొందింది. కేవలం విగ్రహం వల్లనే కాదు, ఆంగికవాచకాలలో ప్రత్యేకతలు ఆయనను ఎస్.వి.ఆర్. వారసుడిని చేశాయి. ఎస్.వి.ఆర్ తర్వాత ఆయనతో పోల్చగలిగిన ఏకైక నటుడు హిందీలో ప్రాణ్. ఈ మాటలను సత్యనారాయణ కూడా సంతోషంగా అంగీకరిస్తారు.

ఇద్దరు మహానటుల సరసన తనకు ఆ విధమైన స్థానం, గుర్తింపు దొరకడం మహద్భాగ్యమనుకుంటారు.
సినీ నటుడిగా ప్రేక్షకులను అలరించిన సత్యనారాయణ రాజకీయ నాయకుడిగా అదే ప్రజలకు సేవ కూడా చేశారు. ఏ సినిమాలో నటించినా తన పాత్రకు న్యాయమే చేసిన ఇటువంటి నటులు నిజంగానే అరుదు.